
సాక్షి
ఏలూరు
మంగళవారం । 23 । ఏప్రిల్ । 2024



రాట్నాలమ్మ తిరునాళ్ల

రాట్నాలకుంటలో రాట్నాలమ్మవారి తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం నుంచి 27వ తేదీ వరకు తిరునాళ్లు నిర్వహించనున్నారు. 8లో ▸



వైఎస్సార్‌సీపీలో చేరికలు

ఎన్నికల సమీపిస్తున్న సమయంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు మరింత జోరందుకున్నాయి. ఇతర పార్టీల నేతలు భారీగా వచ్చి చేరుతున్నారు. 8లో ▸



వ్యక్తి దారుణహత్య

పాతకక్షల నేపథ్యంలో పెదవేగి మండలంలోని భోగాపురం గ్రామంలో రంగారావు అనే వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. 8లో ▸

న్యూస్‌రీల్

కొనసాగుతున్న నామినేషన్లు

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సోమవారం కొనసాగింది. ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గానికి ఐదు, జిల్లాలోని అసెంబ్లీ స్థానాలకు 18 నామినేషన్లు దాఖలయ్యాయి. కైకలూరులో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులుగా దూలం నాగేశ్వరరావు 2 సెట్లు, దూలం వీరకుమారి 2 సెట్లు, బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిగా మానేపల్లి నాగేశ్వరరావు, జై భీంరావ్ భారత్ పార్టీ అభ్యర్థిగా గొంతుపులుగు సతీష్‌కుమార్, ఇండిపెండెంట్‌గా కోటి శ్రీనివాసరావు నామినేషన్లు దాఖలు చేశారు. ఏలూరు ఎంపీ స్థానానికి టీడీపీ తరఫున పుట్టా మహేష్ కుమార్ 2 సెట్లు, ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి పార్టీ అభ్యర్థి రుద్రపాక రత్నారావు ఒక సెట్టు, పుట్టా రవికుమార్ యాదవ్ ఒక సెట్టు, ఇండిపెండెంట్‌గా కొమ్మిన అగస్టీన్ ఒక సెట్టు, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మెండెం సంతోష్‌కుమార్ నామినేషన్లు దాఖలు చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఉంగుటూరులో కాంగ్రెస్ అభ్యర్థిగా పాతపాటి హరి కుమారరాజు ఒక సెట్టు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా పెరుమాళ్ల మురళీకృష్ణ ఒక సెట్టు దాఖలు చేశారు. దెందులూరులో టీడీపీ అభ్యర్థులుగా చింతమనేని ప్రభాకర్ 2 సెట్లు, చింతమనేని సాయి నవ్యశ్రీ 2 సెట్లు, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా నేతల రమేష్‌బాబు ఒక సెట్టు నామినేషన్లు దాఖలు చేశారు. ఏలూరులో రిఫార్మ్స్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా షేక్ హుస్సేన్ ఒక సెట్టు, పోలవరంలో ఇండిపెండెంట్ అభ్యర్థులుగా సరియం రామ్‌మోహన్ ఒక సెట్టు, కారం మల్లేశ్వరరావు ఒక సెట్టు, చింతలపూడిలో టీడీపీ అభ్యర్థులుగా సొంగా రోషన్‌కుమార్ 2 సెట్లు, సొంగా ఇసాక్‌రాజ్ ఒక సెట్టు, ఇండిపెండెంట్‌గా పబ్బిగోళ్ల జాన్ ధర్మరాజు ఒక సెట్టు నామినేషన్లు సమర్పించారు. నూజివీడులో టీడీపీ అభ్యర్థిగా కొలుసు పార్థసారథి ఒక సెట్టు, ఇండిపెండెంట్‌గా బొట్ల శివసత్యనారాయణ రెండు సెట్లు సమర్పించారు.

టీసీసీ పరీక్షలు ప్రారంభం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. డ్రాయింగ్ లోయర్ , హయ్యర్, టైలరింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు జరిగాయి.

పదిలో బాలికలదే హవా

- రాష్ట్రంలో ప్రథమ స్థానంలో జిల్లా విద్యార్థిని
- టెన్త్ ఫలితాల్లో సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- 80.08 శాతం ఉత్తీర్ణత
- మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు



ఏలూరు శనివారపుపేట హైస్కూల్‌లో విద్యార్థి మహేష్‌బాబు (588)ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



గర్రే సాయి తన్మయి, గూటాల (587)



శానం నందిని, కైకరం (587)



జె.యశ్వంత్, చిన్నంపేట (586)



పులి లక్ష్మీ గాయత్రి, పూళ్ల (585)



కె.హనీ, నాగిరెడ్డిగూడెం (584)



ఎం.అనురాధ, నాగిరెడ్డిగూడెం (584)



టి.జగన్నాథం, అప్పలరాజుగూడెం (584)



బి.భువనేశ్వరి, నూజివీడు (583)



షేక్ షబానా మహారాజ్, నూజివీడు (583)

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో బాలికలు సత్తాచారు. జిల్లాలోని ముసునూరు మండలం రమణక్కపేటకు చెందిన ఆకుల వెంకట సాయి మనస్వి రాష్ట్రస్థాయిలో 600 మార్కులకు 599 సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. 23,163 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 80.08 శాతంతో 18,549 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలికలు 11,941 మందికి 10,036 మంది, బాలురు 11,222 మందికి 8,513 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా 13,851 మంది ప్రథమ శ్రేణిలో, 3,116 మంది ద్వితీయ శ్రేణిలో, 1,582 మంది తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. అయితే జిల్లా మాత్రం రాష్ట్రస్థాయిలో 25వ స్థానంలో నిలిచి నిరాశపరిచింది. గతేడాది 64.35 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా ఈ ఏడాది ఉత్తీర్ణతా శాతం పెరగడం విశేషం.

71 పాఠశాలల్లో నూరుశాతం

జిల్లాలోని 71 పాఠశాలల్లో నూరు శాతం ఉత్తీర్ణులు కాగా వీటిలో ప్రభుత్వ రంగ పాఠశాలలు పది ఉన్నాయి. నాగిరెడ్డిగూడెం ఏపీఆర్‌సీహెచ్ స్కూల్, ముసునూరు ఏపీ ఆర్‌ఈహెచ్ స్కూల్, అప్పలరాజుగూడెం ఏపీ ఆర్‌ఎస్ బాలుర స్కూల్, వేలేరుపాడు కేజీబీవీ, లంకపల్లి జీటీడబ్ల్యూహెచ్ స్కూల్, వీరమ్మకుంట జెడ్పీ హైస్కూల్ స్కూల్, కుక్కునూరు కేజీబీవీ, కేతవరం జెడ్పీ హైస్కూల్ స్కూల్, వేదాంతపురం జెడ్పీ హైస్కూల్, చింతలపూడి ఏపీఎస్‌డబ్ల్యూఆర్ బాలుర పాఠశాల ఉన్నాయి.

మే 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ : పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు వచ్చేనెల 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్టు డీఈఓ ఎస్.అబ్రహం తెలిపారు. ఈనెల 23 నుంచి 30 వరకు అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. అలాగే రూ.50 అపరాధ రుసుంతో మే 1 నుంచి 23 వరకూ ఫీజు చెల్లించవచ్చన్నారు. కాగా రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తులు చేసుకోవాలనుకునే విద్యార్థులు హెచ్‌ఎంలను సంప్రదించాలని సూచించారు. రీ కౌంటింగ్‌కు సబ్జెక్టుకు రూ. 500, రీ వెరిఫికేషన్‌కు సబ్జెక్టుకు రూ.1,000 చొప్పున ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు.

సర్కారీ బడి.. ఫలితాల్లో సవ్వడి

జిల్లాలోని ప్రభుత్వ రంగ పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ఆకట్టుకున్నారు.

- శనివారపుపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థి మురాల మహేష్‌బాబు 588 మార్కులు,
- గూటాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థి గర్రే సాయి తన్మయి 587,
- కైకరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని శానం నందిని ప్రియ 587,
- చిన్నంపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థి జె.యశ్వంత్ 586,
- పూళ్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని పులి లక్ష్మీ గాయత్రి 585,
- అప్పలరాజుగూడెం ఏపీఆర్‌ఎస్ బాలుర పాఠశాల విద్యార్థి తిరిమిల్లి జగన్నాథం 584,
- నాగిరెడ్డిగూడెం ఏపీఆర్‌జీహెచ్ స్కూల్ విద్యార్థినులు ఎం.అనురాధ లక్ష్మీ ఐశ్వర్య 584, కస్సే హనీ 584,
- నూజివీడు ఏపీఎస్‌డబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థి బెజవాడ ప్రేమ చంద్రిక 584,
- వడలి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి పామిరెడ్డి దీక్షిత 583,
- నూజివీడు జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థి బత్తుల భువనేశ్వరి 583,
- షేక్ షబానా మెహరాజ్ 583,
- గణపవరం సీహెచ్‌ఎస్‌జెడ్‌పీ పీజీ హైస్కూల్ విద్యార్థి నాభిగారి మేఘన 583 మార్కులు సాధించారు.

బీసీ గురుకులాల్లో విఘ్నేష్



బి.విఘ్నేష్

నరసాపురం రూరల్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లోని బీసీ గురుకుల పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో నరసాపురం మహాత్మా జ్యోతిబా పూలే మత్స్యకార బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి బి.విఘ్నేష్ 581 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచినట్టు ప్రిన్సిపాల్ గోటేటి వేణుగోపాలకృష్ణ తెలిపారు. జిల్లాలో 8 బీసీ గురుకుల పాఠశాలలు ఉన్నాయన్నారు. తమ పాఠశాలలో 36 మందికి 34 మంది ప్రథమ శ్రేణిలో, ఒకరు ద్వితీయ, ఒకరు తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారన్నారు. 10 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారన్నారు.

హోమ్ ఓటింగ్‌కు చివరి అవకాశం

ఏలూరు(మెట్రో): పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వినియోగించుకోలేనివారు హోమ్ ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. 85 ఏళ్ల వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, నడవలేని పరిస్థితిలో ఉన్నవారు ఇంటి వద్ద నుంచి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. ఈ మేరకు అర్హుల ఇంటి వద్దకే వెళ్లి బీఎల్‌ఓలు ఫారం-12(డి) అందిస్తున్నారన్నారు. దరఖాస్తును పూరించి ఈనెల 23లోపు సెక్టోరల్ అధికారులకు అందించాలన్నారు. వీటిని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పరిశీలించి వచ్చేనెల 2 నుంచి 5వ తేదీలోపు ఇంటి వద్ద ఓటు వేసే అవకాశం కల్పిస్తారన్నారు.

నగదు లావాదేవీలపై

ప్రత్యేక దృష్టి

ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకురాలు నీనా నిగమ్



మాట్లాడుతున్న వ్యయ పరిశీలకురాలు నీనా నిగమ్. చిత్రంలో కలెక్టర్, ఎస్పీ

ఏలూరు(మెట్రో): బ్యాంకుల్లో అధిక మొత్తంలో జరిగే నగదు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఎన్నికల విభాగాల నోడల్ అధికారులు, వ్యయ పరిశీలకులతో ఆమె సమీక్షించారు. పోస్టల్ ఆర్డర్లు, యూపీఐ పేమెంట్లపై దృష్టి సారించాలన్నారు. మద్యం రవాణా సమయంలో సక్రమమైన సమయంలో చేరాల్సిన చోటుకు చేరిందా లేదా అన్నది పరిశీలించాలన్నారు. జిల్లాలోని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. బ్యాంకుల్లో పెద్ద మొత్తంలో డిపాజిట్లు, నగదు ఉపసంహరణలపై నిఘా పెట్టాలన్నారు. సోషల్ మీడియాలో అభ్యర్థుల అంశాలపై కూడా దృష్టి సారించాలన్నారు. కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు రూ.13.54 కోట్ల విలువైన నగదు, బంగారం, మద్యం సీజ్ చేశామన్నారు. సీ-విజిల్‌కు సంబంధించి 329 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. 415 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఎన్నికల అబ్జర్వర్లను నియమించి తొలిదశ శిక్షణ పూర్తిచేశామని చెప్పారు. జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో అంతర రాష్ట్ర, జిల్లాల సరిహద్దుల వద్ద 8 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. పెట్రోలింగ్ బృందాలు, మొబైల్ చెక్‌పోస్టులను నిర్వహిస్తున్నామని చెప్పారు. డీఆర్వో డి.పుష్పమణి, అదనపు ఎస్పీ ఎస్.సూర్యచంద్రరావు, జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి సునీల్ నామినేషన్



ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ మంగళవారం నామినేషన్ వేయనున్నారు. ఏలూరు కలెక్టరేట్‌లో ఉదయం నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏలూరు జూట్‌మిల్లు సెంటర్ అల్లూరి విగ్రహం నుంచి మంగళవారం ఉదయం 9 గంటలకు భారీ ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకుంటారు. తొలుత ద్వారకాతిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజల అనంతరం ఆయన ఏలూరు చేరుకుంటారు. ఇప్పటికే ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన సునీల్ కుమార్ నామినేషన్‌కు భారీ ఎత్తున వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు, నేతలు తరలి రానున్నారు. నామినేషన్ కార్యక్రమానికి జిల్లాలోని వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు హాజరుకానున్నారు.

వైఎస్సార్ సీపీలోకి 50 కుటుంబాల చేరిక

పెదవేగి : వైఎస్సార్ సీపీలోకి వరుస చేరికలతో నియోజకవర్గంలో ఆ పార్టీ క్యాడర్‌లో ఉత్సాహం ఉరకలేస్తోంది. దెందులూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సమక్షంలో ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకులు పాలడుగు భానుప్రకాష్ ఆధ్వర్యంలో జగన్నాథపురం గ్రామానికి చెందిన 50 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి వీరందరికి పార్టీ కండువాలు కప్పిన వైఎస్సార్ సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్, నాయకులు అశోక్‌గౌడ్ మాట్లాడుతూ వైఎస్ జగన్ సంక్షేమ పాలన పట్ల ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందంటూ హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ పేదల పక్షాన నిలబడిన జగనన్నను రాజకీయంగా ఎదుర్కోలేక పెత్తందార్లు అమానుషదాడులు చేస్తున్నారని, ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా, జగనన్న సునామీని ఆపడం వాళ్ల తరం కాదని, జగనన్నకు అండగా నిలిచి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు, నియోజకవర్గ పరిశీలకులు నెరుసు నాగసత్యం, జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, పార్టీ పెదవేగి మండల అధ్యక్షులు జానంపేట బాబు, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, సర్పంచ్ కోటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జగన్నాథపురంలో పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్



రాయన్నపాలెంలో సైదం గోపిని వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న అబ్బయ్యచౌదరి

వైఎస్సార్ సీపీలో చేరిక

పెదవేగి: తెలుగుదేశం పార్టీ వికృత చేష్టలకు విసిగిపోయిన నేతలు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి క్యూ కడుతున్నారు. సోమవారం రాత్రి పెదవేగి మండలం రాయన్నపాలెం గ్రామానికి చెందిన సైదం గోపి తెలుగుదేశం పార్టీని వీడి దెందులూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్య చౌదరి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. గోపికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

గిరిజన సూపర్ బజార్ ప్రారంభం



బుట్టాయగూడెంలో నూతనంగా ప్రారంభించిన జీసీసీ సూపర్ బజార్, కాఫీ హౌస్

బుట్టాయగూడెం: గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా సహజ సిద్ధమైన అటవీ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామని జీసీసీ డీఎం జి.పార్వతీశం చెప్పారు. మండల కేంద్రమైన బుట్టాయగూడెంలో గిరిజన సూపర్ బజార్ కాఫీ హౌస్‌ను పార్వతీశం సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీసీసీ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో ఎంతో డిమాండ్ ఉందన్నారు. జీసీసీ ద్వారా విక్రయిస్తున్న తేనెకు ఎంతో డిమాండ్ ఉందన్నారు. అదేవిధంగా జీసీసీ సూపర్ బజార్‌లో ముఖ్యంగా జీసీసీ ద్వారా విక్రయిస్తున్న మరొక ఉత్పత్తి అరకు కాఫీకి కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో ఎంతో పేరుందని అన్నారు. అరకు కాఫీని పశ్చిమ మన్యం ప్రాంతంలో కూడా అందరికీ అందుబాటులో ఉంచే విధంగా కృషి చేస్తున్నామని చెప్పారు. దీనిలో భాగంగానే బుట్టాయగూడెంలో ప్రత్యేకంగా అరకు కాఫీ షాప్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. ఇక్కడ కాఫీ తయారు చేసి విక్రయించడమే కాకుండా కాఫీపొడి ప్యాకెట్లను కూడా విక్రయిస్తామని చెప్పారు. అలాగే కుంకుడుకాయ ప్యాకెట్‌లు, షాంపూలు, బొబ్బర్లు, అలోవెరా సబ్బులు, త్రిఫల, తదితర వస్తువులను విక్రయిస్తున్నామని అన్నారు. నాణ్యమైన వస్తువులను తక్కువ ధరలకే విక్రయించేలా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ సీహెచ్ రాజయోగి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి కోరుకొల్లు జనసేన నేతలు



డీఎన్నార్ సమక్షంలో పార్టీలో చేరిన జనసేన నాయకులు

కలిదిండి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై జనసేన నాయకులు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కోరుకొల్లు గ్రామం నుంచి మాజీ సర్పంచ్ చన్నంశెట్టి సుబ్రహ్మణ్యం, జనసేన నాయకులు చన్నంశెట్టి భాస్కర్, పూసల పుల్లయ్య, పూసల బాలులు ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఉపసర్పంచ్ చన్నంశెట్టి నాగరాజు, పీఏసీఎస్ అధ్యక్షులు అంకెం నరసయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డీఎన్నార్ సమక్షంలో పార్టీలో చేరారు. జిల్లా ఎస్సీ నాయకులు దాసి యేసుబాబు, కాన్వెంట్ కృష్ణ, చన్నంశెట్టి వెంకటరాజు, వలవల చిన్న పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా గోపాల్ యాదవ్ నియామకం



చింతలపూడి : వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు గోరుముచ్చు గోపాల్ యాదవ్‌కు పార్టీ రాష్ట్ర కార్యవర్గంలో కీలక పదవి లభించింది. ఈ మేరకు సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గోపాల్ యాదవ్‌ను పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. చింతలపూడి నియోజకవర్గం, కామవరపుకోట మండలం, గుంటుపల్లి పంచాయితీ కంతమనేనివారి గూడెం గ్రామానికి చెందిన గోపాల్ యాదవ్ సింగపూర్, మలేషియాలలో పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలు పెట్టి ఎంతో మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. ఆయన టీడీపీ నుంచి ఏలూరు పార్లమెంట్ సీటు ఆశించి భంగపడ్డారు. అనంతరం టీడీపీ నుండి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీలో బీసీలకు న్యాయం జరగదని, బీసీలకు వైఎస్సార్ సీపీ మాత్రమే న్యాయం చేయగలదని ఆయన పలు సందర్భాల్లో చెప్పారు. పార్టీలో చేరిన నాటి నుంచి జిల్లాలోని బీసీలను సమాయత్త పరిచి వైఎస్సార్ సీపీలో చేరేలా ప్రోత్సహిస్తున్నారు. బీసీలకు వైఎస్సార్ సీపీలో సముచిత స్థానం ఉందని, బీసీలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలంటే సీఎం వైఎస్ జగన్‌కు మద్దతు ఇవ్వాలని ప్రచారం చేస్తున్నారు. ఏలూరు ఎంపీ కారుమూరి సునీల్ యాదవ్‌తో పాటు జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో బీసీల ఓట్లు వైఎస్సార్ సీపీ అభ్యర్థులకే వేసి గెలిపించాలని విస్తృతంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు.

రూ.272 పలికిన వర్జీనియా కేజీ ధర

జంగారెడ్డిగూడెం : వర్జీనియా పొగాకు ధర కేజీ ఒక్కింటికి రూ.272కు చేరుకుంది. ఈ ఏడాది మార్చి 6న వేలం ప్రారంభం కాగా, ప్రారంభ ధర కేజీకి రూ.240 లభించింది. అయితే ఇది క్రమంగా ఈ నెల 20వ తేదీ నాటికి రూ.266కు చేరుకుంది. కాగా, సోమవారం ఈ సీజన్‌లో అత్యధికంగా రూ.272 ధర పలికింది. అయితే ఇది ఇంకా పెరుగుతుందని రైతులు చెబుతున్నారు. ఇంకా ప్రధాన కంపెనీలు వేలంలో చురుగ్గా పాల్గొనడం లేదు. దీంతో చిన్న చిన్న కంపెనీలు, సప్లయిర్స్ వేలంలో పాల్గొంటున్నారు. గత ఏడాది వేలంలో కేజీ ధర అత్యధికంగా రూ.288 లభించింది. ఈ ఏడాది ఈ గరిష్ట ధర దాటి లభించే అవకాశం ఉందని రైతులు ఆశాభావంతో ఉన్నారు. ఇదిలా ఉంటే జంగారెడ్డిగూడెం-1, -2 వేలం కేంద్రాల్లో సోమవారం కేజీ ధర రూ.272 లభించింది. కొయ్యలగూడెం, గోపాలపురం కేంద్రాల్లో రూ.271, దేవరపల్లి వేలం కేంద్రంలో రూ.268 చొప్పున విక్రయాలు జరిగాయి.

తనిఖీల్లో రూ.2 లక్షల నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న ఎన్నికల అధికారులు

కామవరపుకోట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కామవరపుకోట ఎన్నికల చెక్ పోస్ట్ వద్ద సోమవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఒక వ్యక్తి నుంచి ఎటువంటి ఆధారాలు లేని రూ.1.59 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెక్ పోస్ట్ ఎన్నికల అధికారి మహమ్మద్ మోహిద్దీన్ చెప్పారు. కృష్ణా జిల్లా మొవ్వ మండలం కూచిపూడి గ్రామానికి చెందిన ఆటోలో వెళుతున్న వ్యక్తి నుంచి ఈ నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ నగదున సీజ్ చేసి ఫ్లయింగ్ స్క్వాడ్ ఏఎస్సై స్వామి ద్వారా ఏలూరు ట్రెజరీలో జమ చేస్తామన్నారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది కె.రామకృష్ణ, సూర్యనాయక్, ఎ.సుధీర్, ఎం.నాగార్జున పాల్గొన్నారు.

గణపవరంలో..

గణపవరం: గణపవరంలో సోమవారం ఎఫ్ఎస్‌టీ తనిఖీ బృందం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎన్నికల నిబంధనలకు మించి సొమ్ము కలిగి ఉన్న వ్యక్తి నుంచి రూ.1.06,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నిబంధనల మేరకు రూ.50 వేలకు మించి నగదును వెంట తీసుకువెళితే స్వాధీనం చేసుకుంటామని అధికారులు తెలిపారు.



గణపవరంలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎఫ్ఎస్‌టీ సిబ్బంది

పోలీసులపై చింతమనేని జులుం

- ఏలూరు కలెక్టరేట్ వద్ద హడావిడి
- మరోసారి నోరుపారేసుకున్న చింతమనేని



ఏలూరు కలెక్టరేట్ వద్ద పోలీసులతో వాగ్వివాదం చేస్తున్న చింతమనేని

ఏలూరు టౌన్: అధికారులపై దౌర్జన్యం, దాడులు చేస్తూ నిత్యం వార్తల్లో నిలిచే దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మరోసారి తన నోటి దురుసును ప్రదర్శించారు. ఏలూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఏలూరు కలెక్టరేట్ వద్దకు వెళ్లిన చింతమనేనిని పోలీసులు అడ్డుకోవడంతో రెచ్చిపోయారు. ×ఓవరాక్షన్ చేయవద్దని చెప్పు... చేస్తే ఏం చేయాలో నాకు తెలుసు.. మీకు రెండు నిమిషాలే సమయం ఉంది.. నా స్ట్రెంగ్త్ ఎంతో తెలుసా.. ఏమీ లేకుండా బిల్డప్‌లు ఇవ్వొద్దు మీరంతా౯ అంటూ విరుచుకుపడ్డారు. మేము 60 లక్షల మంది ఉన్నాం.. పోలీసులు మీరు ఎంతమందో తెలుసుగా.. అంటూ హూంకరించారు. మేము ప్రజా సేవకులం.. మీరు డబ్బులకు పనిచేస్తారు.. అంటూ చులకనగా మాట్లాడుతూ పోలీసులకు హెచ్చరికలు చేశారు. దీంతో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న పోలీసు కానిస్టేబుళ్లు చింతమనేని మాటలకు ఏం చెప్పాలో తెలియక నిశ్చేష్టులయ్యారు. చింతమనేని ధోరణి మారకపోవడంతో పోలీసులు అతని తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి రాట్నాలమ్మ తిరునాళ్ల

పెదవేగి : రాట్నాలకుంటలో వేంచేసియున్న శ్రీరాట్నాలమ్మ అమ్మవారి తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు జరిగే తిరునాళ్లకు రాట్నాలమ్మ దేవస్థానం ముస్తాబైంది. భక్తుల పాలిట కల్పవల్లిగా ప్రసిద్ధికెక్కిన రాట్నాలమ్మ ఆవిర్భావం తూర్పుచాళుక్యుల కాలంలోనే జరిగింది. రాజవంశం రత్నాలు సమర్పించి కోరిన కోరిక మేరకు ఈ వేంగిపుర ప్రాంతంలో అమ్మవారు ఒక చేతిలో ఖడ్గంతో మరో చేతిలో కలశాలతో పులివాహనంపై ఈ ప్రాంతంలో రత్నలమ్మగా వెలసింది. బ్రహ్మ, ఈశ్వరుడు, విష్ణువు, కాలభైరవుడు, కుమారస్వామి, చతుర్భుజ దుర్గాదేవి, షడ్భుజదుర్గాదేవి, సుబ్రహ్మణ్యస్వామి సప్తమాతృకలు వైదేహి సూర్య ఉషాదేవి తదితర పరివార దేవతలతో అమ్మవారు ఇక్కడ కొలువై ఉంది. నాటి రత్నలమ్మ నేటి రాట్నాలమ్మగా ప్రసిద్ధి చెందింది.

ఏటా చైత్రశుద్ధ పౌర్ణమి నుంచి..

ఏటా చైత్రశుద్ధ పౌర్ణమి నుంచి ఐదు రోజుల పాటు అమ్మవారి తిరునాళ్లు వైభవంగా నిర్వహిస్తారు. తిరునాళ్ల విజయవంతానికి ఆలయ అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు.

భోగాపురంలో వ్యక్తి దారుణ హత్య

- పాతకక్షలే కారణం.. కత్తితో దాడి
- ఘటనా స్థలంలోనే మృతి



రక్తపు మడుగులో రంగారావు మృతదేహం

పెదవేగి: పాతకక్షల నేపథ్యంలో మండలంలోని భోగాపురం గ్రామంలో ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. పెదవేగి ఎస్సై వి రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భోగాపురం గ్రామానికి చెందిన పామర్తి రంగారావు (44), అదే గ్రామానికి చెందిన మందపాక వరప్రసాద్ మధ్య పాతకక్షలు ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం రంగారావు గ్రామంలోని ఓ దుకాణం వద్దకు రాగా, అక్కడ వరప్రసాద్, రంగారావు మధ్య మాటామాట పెరిగి గొడవకు దారితీసింది. ఇది పెద్దదై వరప్రసాద్ కోపంతో తనకు అందుబాటులో ఉన్న కత్తితో దాడి చేసి రంగరావు పక్కటెముకల వద్ద పొడిచాడు. అనంతరం మెడపై కత్తితో నరకడంతో రంగారావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ కె.శ్రీనివాసరావు, ఎస్సై రాజేంద్రప్రసాద్ వెంటనే ఘటనా స్థలానికి హత్యకు గల కారణాలపై స్థానికుల నుంచి వివరాలు ఆరా తీశారు. క్లూస్‌టీమ్‌ను రప్పించి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

ఏలూరు (టూటౌన్)/కామవరపుకోట: అత్యాచారయత్నం కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ఏలూరు ఐదో అదనపు జిల్లా జడ్జి, మహిళా కోర్టు న్యాయమూర్తి జి.రాజేశ్వరి సోమవారం తీర్పు వెలువరించారు. ఈ కేసుకు సంబంధించి ఏపీపీ డీవీ రామాంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కామవరపుకోట మండలం వీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన నిందితుడు నిజవరపు సత్యనారాయణ అలియాస్ సత్తియ్య 2015 డిసెంబర్ 17న సాయంత్రం 4 గంటల సమయంలో ఆ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో మేకలు మేపుకోవటానికి వెళ్ళిన ఓ మహిళపై వెనుక వైపు దాడి చేసి, పట్టుకుని అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో బాధితురాలు కేకలు వేయడంతో సమీపంలో ఉన్న బాధితురాలి తండ్రి, మరికొందరు స్థానికులు రావడంతో నిందితుడు ఆమెను వదిలేసి పరారయ్యాడు. దీనిపై బాధితులు గ్రామంలోని పెద్దలకు మొరపెట్టుకున్నారు. నిందితుడు పెద్దల వద్దకు రాకపోవడంతో బాధితురాలు తడికలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై అప్పటి ఎస్సై జీజే విష్ణువర్ధన్ కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ చేసి నిందితుడు నిజవరపు సత్యనారాయణను అరెస్టు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేశారు. కేసు విచారణలో ఏపీపీ డీవీ రామాంజనేయులు వాదనలు వినిపించారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో జడ్జి జి.రాజేశ్వరి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షను విధిస్తూ తీర్పును వెలువరించారు. తడికలపూడి ఎస్సై ఎం.జైబాబు, కోర్టు కానిస్టేబుల్ కొండలరావు ప్రాసిక్యూషన్‌కు సహకరించారు.

‘పది’లో ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఏలూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలు నమోదు చేయడం అభినందనీయమని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సైతం 100 శాతం ఉత్తీర్ణత సాధించడం, అత్యధిక మంది విద్యార్థులు అధిక శాతం మార్కులతో ఉత్తీర్ణులు కావడం వంటి ఫలితాలు విద్యాశాఖ పనితీరును సూచిస్తోందన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, కేజీబీవీ, ట్రైబల్ వెల్ఫేర్, మోడల్ స్కూల్స్ ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు వీరందరికీ దిశానిర్దేశనం చేసిన జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఎల్.శ్రీకాంత్, 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా విజయ కేతనం పుస్తకాలు అందించిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఆ పుస్తకాన్ని రూపొందించిన జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి అంగుటూరి సర్వేశ్వర రావులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగులకు ఓటు వేసే అవకాశం కల్పించాలని వినతి

ఏలూరు (మెట్రో): ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకునేలా అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాను రాష్ట్ర వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు కోరారు. సోమవారం ఈ మేరకు ఈ-మెయిల్ ద్వారా ఎన్నికల అధికారికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని ఉద్యోగులందరికీ మే 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు నియోజకవర్గస్థాయిలో పోస్టల్ బ్యాలెట్‌తో సంబంధం లేకుండా ఓటు హక్కు వినియోగించుటకు అవకాశం కల్పించాలని కోరారు.